వేధింపులకు పాల్పడుతున్న అధికారిపై ఆరా!

సాక్షి కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మహిళలపై వేధింపులు అనే శీర్షికతో ప్రచురితమైన కథనంతో ఉన్నతాధికారులు స్పందించారు. మహిళా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్న సదరు అధికారి గురించి ఆరా తీస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మహిళా అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేసి.. మహిళా ఉద్యోగులతో వ్యక్తిగతంగా విచారణ చేపట్టనున్నారు. ఉన్నతాధికారులు తమ ప్రాథమిక విచారణలో సదరు అధికారి గురించి ఓ అంచనాకు వచ్చినట్లు సమాచారం.

చేసిన సేవలు గుర్తింపునిస్తాయి

ఎమ్మెల్యే వివేకానంద్



శానిటరీ జవాన్ గజేందర్‌బాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: రిటైర్మెంట్ అనేది వయస్సుకు మాత్రమేనని, ప్రజాసేవకు కాదని, చేసిన సేవలు గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న గజేందర్ బాబు ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం సర్కిల్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నలభై ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న గజేందర్ బాబు మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహ, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ జగద్గిరిగుట్ట కొండపై పరశురాముడి దేవాలయంలో స్వామి వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న కమిటీ హాల్‌కు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో షిరిడీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. 'ప్రతీ ఒక్కరిని సమానంగా చూసే మనసు పెంచుకో' అనే బాబా బోధనలను భక్తులు అనుసరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, చెట్ల వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్ రెడ్డి, ప్రసాద్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో వికసించిన విద్యా కుసుమాలు

ప్రైవేట్‌కు దీటుగా పది ఫలితాలు – విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు



డి.శరణ్య(571) | నిషితా బేగం(566) | అర్చన(556) | జీవిత(552)

జిజ్ఞాస కుమారి(546) | రాజ్‌కుమార్ (546) | సుమయ్యా బేగం (546) | రమావతి విజయ (545) | కె.స్వాతి (541)

దుండిగల్: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం వెల్లడించిన ఫలితాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నిరు పేద విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు.

ఉత్తీర్ణతలో బహదూర్‌పల్లి ఫస్ట్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, బాచుపల్లి, కుత్బుల్లాపూర్ మండలాల్లో మొత్తం 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 1990 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1466 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 73.67 ఉత్తీర్ణత శాతం సాధించారు. బహదూర్‌పల్లి పాఠశాల 90.07 శాతం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో దూలపల్లి(83.14) మూడో స్థానంలో మల్లంపేట(83.08) నిలవగా, చివరి స్థానంలో గాంధీనగర్(51.25 శాతం) నిలిచింది.

పెరగని ఉత్తీర్ణత శాతం

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అదే ఉత్తీర్ణత కొనసాగింది. గత ఏడాది 73 శాతం ఇదే ఉత్తీర్ణత సాధించగా ఈ సంవత్సరం కూడా అదే కొనసాగింది. 2015–16లో 60, 2016–17లో 65, 2017–18లో 72.14, 2018–19లో 81.14 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 2019–20, 2020–21 కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించలేదు. 21–22లో 62.05, 22–23లో 77, 23–24లో 73 శాతం సాధించగా 24–25లో 73.67 ఉత్తీర్ణత సాధించారు.

టాపర్‌గా శరణ్య

జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న డి.శరణ్య(571) మార్కులు సాధించి నియోజకవర్గ టాపర్‌గా నిలిచింది. కొంపల్లి పాఠశాల విద్యార్థిని నిషితా బేగం (566), సూరారం కాలనీ పాఠశాల విద్యార్థి రాజ్‌కుమార్(563) తరువాతి స్థానంలో నిలిచారు.

పాఠశాలల వారీగా ఉత్తీర్ణతశాతం

నిజాంపేట్ పాఠశాల 68.42 శాతం, బాచుపల్లి 72.83, ప్రగతినగర్ 77.31, గాగిల్లాపూర్ 79.48, బహదూర్‌పల్లి 90.74, కొంపల్లి 81.81, భౌరంపేట్ 80.95, మల్లంపేట్ 83.08, దూలపల్లి 83.14, దుండిగల్ 74.83, నెహ్రూనగర్ 78.16, సూరారం 61.36, కుత్బుల్లాపూర్ 69.06, సూరారం కాలనీ 77.24, జీడిమెట్ల 77.08, గాంధీనగర్ 51.25, జగద్గిరినగర్ 56.52, షాపూర్‌నగర్ 79.22, గాజులరామారం 81.08, భగత్‌సింగ్‌నగర్ 66.66, గురుమూర్తినగర్ 71.15 శాతం ఉత్తీర్ణత సాధించారు.

బీవీఆర్‌ఐటీ కళాశాలను సందర్శించిన కెనడా యూనివర్సిటీ ప్రొఫెసర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ కెన్నత్ బీ కెంట్

నిజాంపేట్ : బీవీఆర్‌ఐటీ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ కళాశాలను బుధవారం కెనడా దేశంలోని యూఎన్‌బీ యూనివర్సిటీ విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ కెన్నత్ బీ కెంట్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెనడా యూనివర్సిటీలో ఉన్న ఉన్నత విద్య అవకాశాలు, అందుబాటు లో ఉన్న వివిధ కోర్సులపై వివరించారు. అనంతరం ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ బీవీఆర్‌ఐటీ, యూఎన్‌బీ యూనివర్సిటీ (ఎంఓయూ) అనుసంధాన ఒప్పందం గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్ సునీత మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కళాశాల నుంచి 8 మందికి పైగా విద్యార్థులు యూఎన్‌బీలో ఉన్నత విద్య కొనసాగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చావా సునీల్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడిని వసతి గృహానికి తరలింపు



దుండిగల్: తప్పిపోయిన బాలుడిని దుండిగల్ పోలీసులు చేరదీసి హోమ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ వద్ద ఓ గుర్తు తెలియని బాలుడు(05) తిరుగుతున్నాడు. సమాచారం అందుకున్న స్థానికులు పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. వివరాలు అడుగగా సమాధానం చెప్పలేకపోయాడు. దీంతో బాలుడిని అల్వాల్‌లోని బాలుర వసతి గృహానికి తరలించారు. బాలుడి సమాచారం తెలిసిన వారు 8712568303, 7780553785 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటా



వేతన ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్న యూనియన్ అధ్యక్షుడు మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల ఇండస్ట్రీ ఎయిన్‌లైన్స్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నూతన వేతన ఒప్పందం బుధవారం షాపూర్‌నగర్‌లో జరిగింది. లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ శ్యాం సుందర్ సమక్షంలో యూనియన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మదన్‌గౌడ్ పరిశ్రమ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్మికుడికి రూ.10,600 వేతనంతో పాటు రూ.10 వేల చొప్పున మూడు సంవత్సరాలకు రూ.30 వేల గిఫ్ట్ ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. అదే విధంగా రూ.2 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ, ఆసుపత్రి వైద్య ఖర్చులు రూ.2 లక్షలు మించితే యాజమాన్యమే భరిస్తుందన్నారు.

రేపు స్వామి వారికి అభిషేకం

జగద్గిరిగుట్ట: భగవత్ రామానుజాచార్యుల 1008 జయంతి సందర్భంగా పద్మానగర్ ఫేజ్ 1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమంజనం (అభిషేకం) నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభిషేకం అనంతరం స్వామి వారిని అలంకరించి శంషాబాద్‌లోని ముచ్చింతల్‌లో నిర్వహించే విశ్వరూపధర రామానుజ ఉత్సవంలో ఉత్సవ విగ్రహం తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ తిరుమంజనం ఉదయం 6 గంటలకు ప్రారంభంకానున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సుభాష్‌నగర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం బహదూర్‌పల్లి జడ్పీహెచ్‌కే కాలనీ వాసులు ఎంపీని ఆయన నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ.. అధికారులతో మాట్లాడి రెండు బోర్లు వేసేలా చర్యలు సుకుంటానని, అదే విధంగా మంజీర పైపులైన్ వేసేలా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.

సత్తా చాటిన 'ది ఇంగ్లిష్ స్కాలర్స్ స్కూల్' విద్యార్థులు



నిత్యసాయి(552) | తేజశ్వి (524) | జ్వాలా సింగ్ (520)

దుండిగల్: భౌరంపేటలోని ది ఇంగ్లిష్ స్కాలర్స్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో 99 శాతం విద్యార్థులు పాసయ్యారు. పి.నిత్య సాయి(552), పి.తేజశ్వి(524), జ్వాలా సింగ్(520) ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ కె. శ్రీశైలం అభినందించారు.

పదిలో యూనిక్ హైస్కూల్ ప్రభంజనం



రిషిక, సాగర్‌కుమార్, దుర్గలను అభినందిస్తున్న కరస్పాండెంట్ శివయ్య, ప్రిన్సిపాల్ నాగభూషణం

కుత్బుల్లాపూర్ : పదవ తరగతి పరీక్షల్లో చింతల్ యూనిక్ హై స్కూల్ మరోసారి ప్రభంజనం సృష్టించింది. మొత్తం 150 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో కె.రిషిక (588/600), సాగర్ కుమార్ (586/600), దుర్గ (581/600) మార్కులు సాధించారు. 43 మంది విద్యార్థులు 550 నుంచి 580 వరకు మార్కులు, మరో 52 మంది విద్యార్థులు 500 నుంచి 550 మధ్య మార్కులు సాధించారు. 500 కు పైగా మార్కులు 98 మంది విద్యార్థులు సొంతం చేసుకుని మొత్తం 99 శాతం ఉత్తీర్ణత సాధించడం పై పాఠశాల కరస్పాండెంట్ శివయ్య, ప్రిన్సిపాల్ నాగభూషణం విద్యార్థులను అభినందించారు

నార్త్‌సిటీ హైస్కూల్ విద్యార్థుల హవా



అనుష్క (586/600) | వివేక్ (571/600)

సుభాష్‌నగర్: సూరారం నార్త్ సిటీ హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. అనుష్క మానేకు 586/600 , వివేక్ 571/600 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ కోలా వెంకటేష్ముదిరాజ్ మాట్లాడుతూ.. లాభార్జన ధ్యేయంగా కాకుండా వెనుకబడిన విద్యార్థులను చదువులో రాణించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. మా వద్ద చదువుతున్న విద్యార్థుల్లో అనేకమంది తల్లిదండ్రులు దినసరి కూలీలు, కార్మికులేనని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.